# సూరిబాబు నవ్వు

మేనమామలూ, మామ కూతుళ్ళూ చాలామందికి ఉంటారు. గిరిబాబుకి మేనమామ ఉండడంవల్ల నష్టమేమీలేదు. కానీ, ఆ మామకి కూతురుండడమే అతనికి కొంప ముంచినట్టయింది. తెలుగుదేశపు సాంప్రదాయం ప్రకారం (రూల్సు ప్రకారం) అతనావిణ్ణి ప్రేమించేడు. కాని ఆమెకి మాత్రం సాంప్రదాయం యెడల గౌరవం లేకపోయింది. అన్ని రూల్సునీ ఆవిడ నిర్లక్ష్యం చేసింది. పెళ్ళి పదిహేను రోజులున్నదనగా (అచ్చు వేయించిన శుభలేఖలని కూడా లెక్కచెయ్యకుండా) ఆవిడ పరారీ అయిపోయింది.

అది ఇరవయ్యేళ్ళ క్రిందటి ముచ్చట. అప్పటికి గిరిబాబుకి ఇరవయ్యేళ్ళు. మానవుల మంచితనంమీద గిరిబాబుకి నమ్మకం పోవడం అప్పట్నించి ప్రారంభం అయ్యింది. "బావా మరోలా అనుకోకు. నువ్వంటే నాకు ఇష్టమే. కాని, నీకు పెళ్ళాంగా ఉండడం అంటే నాకు చాలా సిగ్గుగా - ఓనమాలు నేర్పిన చిన్నప్పటి మాష్టార్ని పెళ్ళాడవలసి వస్తే సిగ్గువేసినట్టు - చాలా సిగ్గుగా ఉంది. మొగవాళ్ళని మొగవాళ్ళు పెళ్ళాడరనుకో కాని, మాటవరసకి చెపుతున్నాను. చిన్నప్పుడు నీచేత గణపతిపూజ చేయించిన పొట్ట బ్రాహ్మణ్ణి పెళ్ళాడమంటే నువ్వు పెళ్ళాడగలవా? అలాగే జరిగింది నా విషయంలో కూడా. నీకు పొట్టలేదనుకో (జోక్ అంతే. మరోలా అనుకోకు. నీకు పొట్టలేదు. అలానే అనుకో అదే కరెక్టు) కాని, పూజాభక్తి, డివోషనూ, రెవరెన్సూ - నీకూ నాకూ అటువంటి సంబంధం ఉండడం వల్ల నేను నిన్ను పెళ్ళాడలేను. దేవుణ్ణి పెళ్ళాడడానికి ఏ ఆడదీ కూడా ఇష్టపడదనే నా అభిప్రాయం. ఆ కారణం వల్లనే నేన్నిన్ను పెళ్ళాడజాలను. నన్ను క్షమించు. నువ్వు క్షమించగలవని నాకు తెలుసు. మా అమ్మా నాన్నా అర్థం చేసుకోలేరు. అందువల్లనే నన్ను క్షమించలేరు. అందుచేతనే నాకు ఈ పరారీ. ఆ తప్పు క్షమించమనే నీకు ఉత్తరం. నేను తప్పు చేసినందుకు నేను బాధపడ్డంలేదు. నువ్వెంత బాధపడతావో కదా అనే నాకు బాధగా ఉంది. అప్పుడు పుట్టిన మేకపిల్లని అష్టకష్టాలూ పెట్టినంత గిల్టీగా నేను ఫీలవుతున్నాను. ఇట్లు నీ మరదలు రమ.

అని ఉత్తరం పోస్టు చేసి మరీ వెళ్ళిపోయింది రమ. గిరిబాబు కోపించలేదు కాని, ఎంతో బాధపడ్డాడు. డాబామీదికి వెళ్ళిపోయి అక్కడ కూర్చొని అతను కళ్ళంట నీళ్ళు పెట్టుకున్నాడు. అతని బాధని చుక్కలు చూడలేదు. చంద్రుడూ చూడలేదు. పక్కింటివారి చింతచెట్టు కొమ్మలు అతను కూర్చున్న చోటున పైనంతా విస్తరించుకున్నాయి. చింతచెట్టు చీకటి కొమ్మల్లో అతని నిట్టూర్పులు చిక్కుకొని విరిగి చల్లారిపోయాయి. రమ పారిపోయి తప్పుచేసిందని అతను అనుకోలేదు. కాని, ముందేనాడో చెప్పేస్తే ఎంత బావుండునో కదా అని అతను అనుకున్నాడు. ఇంతవరకూ ఊరుకొని అసలు విషయం ఇప్పుడు చెప్పడం అదొక విధమైన మోసం కదా అనిపించిందతనికి. తను ప్రేమించిన రమే తనని ఈ విధంగా

ఆఖరిక్షణాన్న రసాభాసుపాలు చేయడంతో, "ఛీ. మానవుల్ని మరింకెప్పుడూ నమ్మకూడదు" అనుకున్నాడతను.

సూరిబాబుతో ఆ మాటే అతను చెప్పేడు కూడాను. సూరిబాబుకి తనకీ స్నేహం తప్ప బంధుత్వం లేదు. అతను (సూరిబాబు) శ్రీరాముల్లా కారునల్లగా ఉండి ఎంతో సౌమ్యంగా ఉంటాడు. అతని కళ్ళు మాత్రం శివుడి మూడోకన్ను రెండుగా మారినట్టు ఎఱ్ఱగా పెద్దవిగా భగ భగలాడుతూ ఉంటాయి. మంచికయినా, చెడ్డకయినా, ఎఱ్ఱకళ్ళ నల్లవాణ్ని ఆపడం కష్టం.

"చూడ్రా సూరీ, రమ ఏం చేసిందో!" అని అంతా చెప్పి "వాళ్ళింకా శుభలేఖలు అచ్చువేయించలేదు. కాని, నేను మాత్రం అచ్చువేయించి, మధ్యాహ్నం అల్లా కూర్చొని ఊదా సిరాతో అడ్రసులు రాసి ఇందాట్లానే పోస్టు చేసీను కూడాను. నవ్వులపాలు చేసి రమ నన్నెంత మోసం చేసిందో చూడు! ఛీ, ఏ మానవుణ్నీ నమ్మకూడదురా సూరీ!" అన్నాడు గిరిబాబు.

ముద్దుగా పెంచిన విధవ తల్లి తనను విడిచిపెట్టి ఎవరితోనో ఎక్కడికో వెళ్ళిపోతే కొడుకు బాధపడ్డట్టు బాధపడ్డాడు గిరిబాబు.

ఇష్టం లేన్దాన్ని కట్టుకొని నువ్వేం సుఖపడుదువు! జీవితంలో ఆవిడ బాధ ఈరోజుతో నీకు ఫినిషు పడే బాధలేవో మరెవణ్నో పడమను మనకేల? అని చెప్పి "శుభలేఖలు సంగతి నా కొదిలీ" అని చకచక లేచి వెళ్ళేడు సూరిబాబు. వెళ్ళి పోస్టుమాష్టర్ని బతిమాలుకున్నాడో, పోస్టుమన్‌కి లంచమే ఇచ్చాడో, లేక రెండూ చేసేడో కాని ఆ శుభలేఖలు మాత్రం పోస్టు డొక్కులోంచి తీయించేసి పట్టుకొచ్చి గిరిబాబు చేతికి ఇచ్చేడు సూరిబాబు. ఊదా సిరాతో వాటిమీద వ్రాసిన అడ్రసులు చూసుకొని గిరిబాబు కళ్ళంట నీళ్ళు పెట్టుకున్నాడు.

చివరికి గిరిబాబు మరొక వేలువిడిచిన మేనమామ కూతుర్ని త్రికరణశుద్ధిగా పెళ్ళాడేడు. ఆమె కారణంగా అతనికి మానవుల మంచితనంమీద ఉండిన నమ్మకం మరికొంత సడలింది కాని, ఆ కారణం అతను సూరిబాబుతో కూడా చెప్పుకోలేకపోయాడు.

గిరిబాబు భార్య "చెడ్డది" కాదు. అంటే, ఆవిడ దొంగతనం చెయ్యదు. వ్యభిచారిణి కాదు. జూదం ఆడదు. నిషా పదార్థాలు తాగదు. మంచిదేనా అంటే, ఆ విధంగా మంచిదనే చెప్పాలి కాని రమకి అక్కరలేని వాడిచేత తను తాళి కట్టించుకోవలసి వచ్చినందుకు ఆవిడ రమని కాని గిరిబాబుని కాని క్షమించలేకపోయింది. అందుచేత, ఆవిడకి లోకం యెడల ద్వేషమూ, భర్తయెడల అగౌరవమూ పెరిగేయి. అటువంటి పెరుగుదలగల ఆడమనిషితో కాపరం చెయ్యడం గిరిబాబుకి కష్టంగా తోచిందంటే అందులో ఆశ్చర్యపడవలసిందేమీలేదు. తాళి కట్టి తెచ్చుకున్నది అంత నిర్లక్ష్యంగా ప్రవర్తించినపుడు మొగుడన్న వాడికి మనుష్యుల మంచితనంమీద నమ్మకం తగ్గిందంటే కూడా ఆశ్చర్య పడవలసిన పనిలేదు.

ఆవిణ్ణి పెళ్ళాడ్డానికి గిరిబాబు కట్నమేమీ కోరలేదు. మూడువేలు ఇస్తామంటే అతను వద్దనాలేదు. "నాకు ఇవ్వక్ఖరలేదు" పిల్ల పేరటనే వేయించండి అని కూడా చెప్పేడు. అందుకతని మామగారు వప్పుకున్నాడు కూడాను. తీరా పెళ్ళి అయేక మాత్రం గిరిబాబుతో అతని మామగారు "నా కూతురు ఖరీదే డెబ్బయి లక్షలుంటుంది. అటువంటిదాన్ని నీ చేతుల్లో పెట్టేక ముష్టి మూడువేలు నీకెందుకురా అల్లుడూ!" అని వెటకారంగా నవ్వుతూ చెప్పేసేడు.

"నాకు ఇవ్వమనలేదు మీ కూతురికి ఇస్తానన్న వాగ్దానం మీరు నిలబెట్టుకోవడం మర్యాదా అని చెపుతున్నాను" అని గిరిబాబు కొంచెం వినయంగానే చెప్పినప్పటికీ పక్కనున్న అతని భార్యకి మాత్రం తెగ కోపం వచ్చింది. "ముప్ఫయివేలు కట్నం పుచ్చుకొని రమనే పెళ్ళాడ లేకపోయారా?" అని ఆవిడ రుసరుసలాడింది. ఆవిడ విషయం గురించి గిరిబాబు సూరిబాబుతో -

"చూసేవురా సూరీ మనుషుల మంచితనం ఎటువంటిదో! తాహతు ఉండీకూడా కన్న కూతురికిచ్చిన మాట నిలబెట్టుకోలేకపోయేడు. ఆ మాట నేనన్నందుకు ఆ కూతురికే నామీద కోపం వచ్చింది" అని ఫిర్యాదు చేసుకున్నాడు.

సూరిబాబుకి పి.డబ్ల్యు.డి. ఆఫీసులో అకౌంటెంటు ఉద్యోగం ఉంది. గిరిబాబు మామగారికి కాంట్రాక్టు వ్యాపారం వుంది. ఏ బిల్లు దగ్గర ఏ నొక్కు నొక్కేడోకాని మరొక ఏడాది లోపల గిరిబాబు భార్య పేర గిరిబాబు మామగారు మూడువేలు బ్యాంకులో వేసేరు. ఆ విషయం గిరిబాబుకి తెలిసేక అతను తన మామగార్ని తల్చుకొని మరీ అసహ్యించు కున్నాడు.

"అలా నొక్కు నొక్కితేగాని ఏ మాటకీ ఏ కట్టుబాటుకి నిలబడని మానవుల్ని ఏం నమ్మమంటావురా సూరీ?" అన్నాడు సూరిబాబుతో గిరిబాబు.

"మనుష్యులు కొంతమంది అంతేన్రా" అన్నాడు గిరిబాబు. "ఛీ అంతా అంతేన్రా" అన్నాడు గిరిబాబు.

"ఛీ ఈ మానవులంతా దుష్ట వెధవలే ...." అని గిరిబాబు చాలాసార్లు అనుకొనేలా చేసిందతణ్ని అతని జీవితం. పెరటింటి పెత్తండ్రి కొడుకు తన పెరటిగోడని గిరిబాబు పెరట్లోకి నెట్టబోయినప్పుడు అది తప్పని చెప్పి గిరిబాబు వాదించేడు. అలా చెయ్యవద్దని బతిమాలుకున్నాడు. చివరికి సూరిబాబు సలహామీద అక్కడ కర్ర పట్టుకునిల్చొని 'దావాకి వెళితే వెళ్ళు కాని ముందుగా ఇక్కడ గోడ మాత్రం కట్టనివ్వను' అని దబాయిస్తేగాని గోడ కట్టడం మానేడుకాదు ఆ పెరటింటి పెత్తండ్రి కొడుకు. తరువాత సూరిబాబు మధ్యవర్తిగా నిలబడి ఆ తగవు సెటిల్ చేసేడు. కాని ఆ తగవువల్ల గిరిబాబుకి మానవుల మంచితనంమీద నమ్మకం పెరగలేదు.

డాబామీద కొట్టుగది కట్టించుకోవాలి! దయచేసి మీ చింతచెట్టు కొమ్మలు కొట్టించి వేస్తారా? అని పక్కింటివాణ్ని ప్రశ్నించినప్పుడు ఆ పక్కింటివాడు (కుర్చీలో కూర్చున్న మనిషి ముందుకి కొంచెం వంగి తల కిందకు దించి, దింపుడు కళ్ళను పైకెత్తి చూసి.) "మరి నా నష్టం ఎవడిస్తాడు?" అని ఎండుగడ్డిని ఎర్రనిప్పు అడిగినట్టు అడిగేడు. "నష్టం ఏఁవిఁటి?" అని అడిగేడు గిరిబాబు. చింతకాయలు నష్టపోనా కొమ్మలు కొట్టించేస్తే నూరేళ్ళనుంచి కొమ్మలు మీ డాబామీదని కాపరం ఉంటున్నాయి. ఆ కొమ్మలు అక్కడుండడానికి వాటికి హక్కులు సంక్రమించేయి. ఇప్పుడు వాటిని కొట్టించేస్తే ఆ కొమ్మలు చింతకాయలు నాకెవిడిస్తాడు?" అని తను కూర్చున్నవాడు లేవకుండా నిల్చున్న గిరిబాబుని కూర్చోమనకుండా ప్రశ్నించేడు పక్కింటివాడు. "మీకు నష్టం ఒస్తుందని చెప్పి మీ కోసం నేను చింతకాయలు కాయాలి కాబోలు" అని కొంచెం వెటకారంగానే అన్నాడు గిరిబాబు. అప్పుడు ఆ పక్కింటివాడు

కించిత్తయినా చలించకుండా "ఏమో, నువ్వే కాస్తావో నీ పెళ్ళామే కాస్తుందో - అది నాకు తెలీదు. ఎవరు కాసినా ఏటా నా చింతకాయల ఖరీదు మాత్రం నాకు ముట్టాలి" అని నిదానంగా చెప్పి మరింక గిరిబాబుతో మాట్లాడకుండా చుట్ట కాల్చుకుంటూ కూర్చున్నాడు.

"చూద్రా సూరీ" అని అంతా వివరంగా అతనితో చెప్పేడు గిరిబాబు.

"ఇలాకాదు. మా ఇంట్లో ఓ విధవ పనిమనిషుండేది. అది నేను చెప్పినమాట వింటుంది. అది మీ పక్కింటివాడి పులుపంతా విరిచీగలదు" అని గిరిబాబుని ఉండమన్నాడు సూరిబాబు.

ఆ తరువాత ఆ పనిమనిషి ఆ పక్కింటి చింతచెట్టువాటికి చిగురుటాకులా ఓ నోటీసు పంపించింది. ఏడాది కిందట వాగ్రూపమైన అగ్రిమెంట్ చేసుకొని కూడా సంబంధం పెట్టుకొని కూడా ఆ షరతు ప్రకారం సౌఖ్యమే అనుభవించేడట కాని మనోవృత్తి చెల్లించి తన బాధ్యత నిర్వర్తించలేదట ఆ చింతచెట్ల పెద్దమనిషి. ఆ నోటీసుతో ఆ పెద్దమనిషి సూరిబాబుద్వారా ఏడువందలకి ఆ పనిమనిషితో తగువు పరిష్కరించుకొని గిరిబాబు "ఇంటిమీద చింత కొమ్మలు" కూడా తీయించేసేడు.

ఈ చింతకొమ్మల తగువ్వల్లకాని, మరెందువల్లకాని, మానవుడు మంచివాడంటే ఒప్పుకొనే స్థితికి దగ్గర కాలేకపోయేడు గిరిబాబు.

ఆ తరువాత కాలేజీలో ప్రిన్సిపాల్ తనను లెక్చరర్ ఉద్యోగం నుంచి లేవలేకుండా చేసినప్పుడుగాని, తోడి లెక్చరర్లు తనని అల్లరి పెట్టించినప్పుడుకాని, ఓసారి బట్టలకొట్టువాడితో తగువొచ్చినప్పుడుకానీ మేడమీద గది కట్టిన మేస్త్రీ డబ్బు పుచ్చుకొని పని ఎగ్గొట్టినప్పుడు కానీ, ఇంకా అనేకానేక విషయాల్లో చిక్కుకున్న ఏ సమయాలలో కాని, గిరిబాబు మానవులంతా దుష్టులనే అనుకున్నాడు కాని మరొకలా అనుకోలేకపోయాడు.

అవన్నీ ఒక ఎత్తు, ఆ మధ్య తను చిక్కుకుపోయిన సమస్య మరొక ఎత్తు. అది అతణ్ని మొదలుకే ఊపేసింది. మనసు చలించిపోయి వెర్రెత్తిపోయేవాళ్ళా చేసేసింది. తను భూమ్మీదే ఉన్నాడో సుడిగాలిలో చుట్టుకునేపోతున్నాడో సముద్రంలో ఊపిరి అందక కొట్టుకునేపోతున్నాడో అతను తెలుసుకోలేకపోయాడు.

ఆ సమస్యలో అతను అకస్మాత్తుగా చిక్కుకున్నాడు.

ఓనాడు రాత్రి పదకొండు గంటలకి ఇంట్లో అంతా నిద్రపోతున్నారు. కాని తను మాత్రం కొత్త టెక్స్టు పుస్తకం ఏదో చదువుకొంటున్నాడు. టేబిల్‌లైటు వెర్రిగా నవ్వుతోంది. గోడని గడియారం టక్కు టిక్కు మంటోంది. షెల్ఫులో పుస్తకాలు మూగగా నిద్రపోతున్నాయి. గోడమీద బల్లి ఉండి ఉండి కలవరించి లేస్తోంది. గిరిబాబు నిదానంగా చదువుకుంటున్నాడు. అంతలో వీధి తలుపు చప్పుడయినట్టయింది. గడియారమే ఆ విధంగా చప్పుడు చేసిందని గిరిబాబు అనుకుంటే, కాదు కాదని తలుపు మళ్ళీ చప్పుడయ్యింది.

గిరిబాబు కొంచెం ఆశ్చర్యపోయి తలుపు తీసి చూసి ఇంకా మరీ ఆశ్చర్యపోయేడు. అక్కడొక ఆడమనిషి వుంది. ఆవిడ ప్రవర్తన ఇంకా ఆశ్చర్యకరంగా వుంది. తలుపు తియ్యగానే తిన్నగా వెళ్ళి ఆవిడ గదిలోపల దీపం దగ్గర ఉన్న కుర్చీ ప్రక్క దీపానికి ముఖం చాటుగా

నిల్చొంది ఆవిడకి దగ్గరదగ్గర నలభయ్యేళ్ళుండవచ్చు. జుట్టు కొంత పండింది. లావుపాటి మనిషి సన్నం అయిపోయినట్టుగా వడలిపోయి వుంది.

"ఎవరు ఎవరు? మీరెవరు? ఎవరు కావాలి మీకు?" అని గాబరాగా అడిగేడు గిరిబాబు.

అతనలా అడగ్గానే ఆవిడ ఒక్కసారిగా ఏడవటం ప్రారంభించింది. అయితే మాత్రం చప్పుడు చెయ్యకుండా కొత్తకుండ నీరు కార్చినట్టు ఏడ్చింది. పమిటతో పదే పదే కళ్లొత్తుకొని, మరింక వత్తుకోలేక కళ్ళంట నీరు కారుస్తూ నిలబడిందావిడ.

"ఎవరమ్మా మీరు?" అని జాలిగానూ కొంచెం భయంగానూ అడిగేడు గిరిబాబు.

గిరిబాబు ఆమెకు కొంచెం అటు పక్కగా వెళ్ళి మళ్ళీ అడిగితే అవిడ ముఖం మరో పక్కకి తిప్పుకొని -

"బావా, నేను చచ్చిపోయానైనా కాను. నేను రమని" అంది. ఆవిడెవరో తెలియక పోయిన కంటె తెలిసినప్పుడు ఇంకా ఎక్కువ గాభరాపడ్డాడు గిరిబాబు. ఆమెని చూసి ఇరవయ్యేళ్ళయింది. అతని మనస్సులో ఆమె గురించి జ్ఞాపకాలూ, ఆమె రాకకి అతను ఊహించుకున్న కారణాలూ కలసి గడబిడగా కొట్టుకున్నాయి. అతని కనురెప్పలు నీళ్ళతో రెపరెప కొట్టుకున్నాయి.

కూర్చోమంటే రమ కూర్చుంది. కాని, మరణశిక్ష కోసం ఎదురు చూస్తున్నదాన్లా కూర్చుంది. ఆమె కళ్ళలో భయమూ, ముఖంలో విచారమూ కనిపిస్తున్నాయి. ఆమె గుండెలోని వేదనాభారం మాత్రం స్పష్టంగా తెలియడం లేదు. అదంతా గిరిబాబుకి ఆమె తేటతెల్లంగా తెలియజేసేసరికి బాగా తెల్లవారిపోయింది.

రమ జీవితం అంతా కష్టాల నవలలా అప్పటి వరకూ నడిచింది. ఆ రోజుకి ఆమెకి మూడువేల రూపాయలు అవసరం వచ్చి ఆమె గిరిబాబు దగ్గరికి మరే ఆధారం ఎక్కడా దొరక్క వచ్చింది. ఆ మూడువేలూ ఉంటే ఆమె 'భర్త పెను ఆపదలోంచి బైటపడటానికి వారి ఇరువురి జీవితాలూ కుదటపడటానికి అవకాశం ఉందనీ లేకపోతే ఇరువురూ కలిసి ఆత్మహత్య చేసుకోవడం తప్ప వారికీ వేరే గత్యంతరం లేదనీ ' రమ దీనాతిదీనంగా నేలంతా నెత్తురు చుక్కలతో తడిసినట్టు చెప్పింది.

రమతో తన భార్య మాట్లాడనయినా మాట్లాడకపోవడంగాని, తన ఇంటివారంతా కలిసి ఆమెనొక అంటరానిదాన్లా చూడ్డంగాని గిరిబాబు గమనించలేదు. రమని గట్టెక్కించడానికి తను నదిలోకి ఉరికినట్టు ఉరికేడు. అతనికి ఆ పనియందు తప్ప మరే విషయంమీదా కూడా మనసు లగ్నం కాలేదు.

బాంకులో ఉన్న పదిహేను వందలూ గిరిబాబు విత్‌డ్రా చేసేడు. సూరిబాబు దగ్గర అయిదు వందలు చేబదులుగా తీసుకున్నాడు. తరువాత, మరొక లెక్చరర్ దగ్గిర అయిదువందలు చేబదులుగా తీసుకున్నాడు. ఆ తరవాత, సూరిబాబు సాయంతో వెళ్ళి ఓ కాబూలీవాడి దగ్గర మరొక అయిదువందలు అప్పు తీసుకొని వాడిపేర వెయ్యి రూపాయిలకి ప్రోనోటు రాసేడు. ప్రోనోటుమీద గిరిబాబుతోపాటు సూరిబాబు కూడా సంతకం చేస్తేనేగాని

సొమ్ము ఇవ్వనన్నాడు కాబూలీవాడు. అలాగే సంతకం చేసేడు సూరిబాబు.

ఆ మూడువేలూ సిద్ధపరచి గిరిబాబు ఇంటికి తిరిగి వచ్చేసరికి సాయంకాలం ఏడుగంటలు దాటింది. వేసవికాలం, సాయంత్రం మసక మసగ్గా ఉంది. వీధి గదంతా కనుచీకట్లో వుంది. ఆ చీకట్లో మూగపుస్తకాల మధ్య కుర్చీలో వంటరిగా కూర్చున్న రమ, గిరిబాబుని చూడగానే లేచి నిల్చుంది. సోదర మానవులకి సాయంచేస్తే కలిగే పరమ సంతోషంతో గిరిబాబు ఆ సొమ్ము రమ చేతికిచ్చాడు.

ఆ చీకట్లో ఆ సొమ్ము తీసుకున్న రమ కృతజ్ఞతాపూర్వకంగా గిరిబాబుకి ఒక్క మాటయినా చెప్పలేదు.

'లెక్క పెట్టుకో రమా' అన్నాడు గిరిబాబు.

రమ చేతిలోంచి సొమ్ము జారి బల్లమీద పడింది. ఆమె ఏ మాటా అడక్కుండా వెక్కి వెక్కి ఏడుస్తూ కుర్చీలో కూలబడింది. ఆమె అలా ఎంతసేపు ఏడ్చిందో చెప్పడం కష్టం చాలాసేపు ఏడ్చింది. ఆవిణ్ణి రాతికొండలో కప్పెడితే ఆ కొండంతా కదిలి పగిలేటంతగా ఆమె ఏడ్చింది. జీవితంలో తను చేసిన పాపాలూ అన్యాయాలూ, తనకి జరిగిన అన్యాయాల వల్ల కలిగిన తాపాలూ, కోపాలూ, పగలు, బాధలు, తన నిరాశలు, దురాశలు, మనసులోని పెను కల్మషాలు అన్నీ కూడా కరిగి నీరైపోయినంతగా ఆమె ఏడ్చింది. ఏళ్ళ తరబడి మురుగునీరు నిలవున్న చెరువుకి గండి కొట్టేస్తే చెడునీరంతా పైకి పోయినట్టుగా ఆవిడ వరద వరదగా వలవల ఏడ్చింది. ఏడ్చిన తరవాత ఆవిడ ఎంతోసేపు అలా నిశ్శబ్దంగా కూర్చుంది. ఆ తరవాత ఆవిడ కొత్తనీటి చెరువులో కలవపువ్వు వికసించినట్టు నెమ్మదిగా నవ్వింది. ఆ మర్నాడు ఆవిడ గిరిబాబు ఇంటినుంచి వెళుతూ "బావా నేను ఆలయం నుంచి ఇంటికి వెళుతున్నాను బావా" అంది గిరిబాబుతో. గిరిబాబు చాలా గాభరాలో ఉన్నాడు. ఆమె మాటలు అతనికి సరిగా వినబడలేదు. అర్థంకాలేదు. తన కాళ్ళకి ఆమె నమస్కరించినప్పుడు అతను విపరీతంగా సిగ్గుపడిపోయేడు. అతని ముఖం ఎర్రగా కందిపోయింది.

రమ వెళ్లిన కొద్ది రోజుల్లోనే గిరిబాబు ముఖం నల్లగా మాడిపోయింది.

అందమైన చిత్రాన్ని వళ్ళు మర్చి చూస్తుంటే వెనకనుంచి వచ్చి ఎవరో తాపు తన్నినట్టుగా అయింది గిరిబాబుకి. రమకి జరిగిన మేలు గురించి అతను ఆలోచిస్తూ ఆనందంగా ఉంటుండగా అతని భార్య ఆ రోజున ఇంట్లో ఓ పెద్ద బాంబు పేల్చింది. ఆవిడ సన్నగా, పొట్టిగా చామనఛాయగా ఉండి మతాబాసక్క సిసింద్రీలా ఉంటుంది. సిసింద్రీల్లో మందు కుక్కుతారు. ఆవిడ కోపం, ద్వేషం, విషం ఇటువంటి గుణాలన్నింటినీ కుక్కుకొని ఉంటుంది. ఆవిణ్ణి కుడితే తేలు చస్తుందట. పాము పళ్ళూడిపోయి చతికిలబడిపోతుందిట. ఆ సంగతి పనివాళ్ళకీ, పాలవాళ్ళకీ, పొరుగువాళ్ళకి తెలుసు. కాని గిరిబాబుకే తెలియదు. తెలిసేక అతను గుండు దెబ్బకి పిండిబొమ్మ రాలిపోయినట్లు రాలిపోయేడు. వడదెబ్బకి తులసిమొక్క వాలిపోయినట్లు వాలిపోయాడు. కెరటం దెబ్బకి ఇసుకగూడు పోయినట్లు ఏమీ కాకుండా పోయేడు.

రమ వెళ్ళగానే గిరిబాబు భార్య అతనితో చెప్పింది.

"ఆ రంకుముండని తెచ్చుకొని దాన్తోనే కాపరం చెయ్యండి. నాకభ్యంతరం లేదు. కాని, నా కొడుకు జీవితం పాడు చేస్తున్నారు. అందుకు నే నూరుకోను ...."

అని పళ్ళు పటపట కొరుకుతూ చెప్పింది గిరిబాబు భార్య.

"ఏం చేస్తావు శ్యామా?" అని దీనంగా ప్రశ్నించేడు గిరిబాబు.

"ఏం చేస్తానో మీరూ ఆ రంకుముండా చూద్దురుగాని" అని విసురుగా వెళ్ళింది శ్యామ.

అవిడ వెళుతూ తన కొడుకుని కూడా తీసుకొని కన్నవారింటికి వెళ్ళిపోయింది. ఇంట్లో ఆరోజున కాలేజీకి సెలవుపెట్టి కళ్ళంట నీళ్ళు పెట్టుకొని ఉండిపోయేడు గిరిబాబు.

ఆరోజే ఆవీధి అవాడ కూడా వార్త పాకిపోయింది. "గిరిబాబు నంగిరి పింగిరిగా ఏఁవీఁ ఎరగనట్లు కనిపిస్తాడే కాని పచ్చి దొంగట. పల్లిగ్గా ముండని తెచ్చి ఇంట్లో పెట్టుకున్నాట్ట!"

"పెళ్ళాం చూస్తూ ఊరుకుందీ?"

"నెత్తి నోరూ కొట్టుకొం ...."

"వాణ్నీ ఆ ముండనీ కలిపి ఓ మొత్తు మొత్తకుండా అదెందుకు నెత్తి కొట్టుకోడం?"

"ఏను అవిడ నెత్తి నోరూ కొట్టుకొని ఏడిస్తే అవిణ్నీ కొడుకునీ కట్టకట్టి వాళ్ళ కన్నవారింటికి తగిలేసేట్ట!"

"ఇలాంటి వెధవల్ని కమ్చీ పట్టుకొని రోడ్డుమీద పట్టపగలు కొట్టాలా."

"కొట్టకూడదు. ఉతకాలి"

"బాగా చెప్పేవు. ఉతికేసి ఇస్త్రీ కూడా చేసేయాలి."

"బాగా అన్నావు."

ఇది ఇలా ఉండగా -

ఆ మర్నాడే మరొక ప్రమాదం జరిగింది.

గిరిబాబు ఇంట్లో ఓ పనిమనిషుంది. ఆమెకి అభిమానంగా చూసుకునే పెనిమిటున్నాడు. ఆమెకు టక్కులెక్కువ. షోకులెక్కువ. గుండెలెక్కువ. అన్నీ ఎక్కువే. కాని, భగవంతుడే దుర్మార్గుడు. ఆమెకి అన్నీ యిచ్చి మూర్ఛరోగం కూడా ఇచ్చేడు.

శ్యామ వెళ్ళిన రెండురోజులనాడు గిరిబాబు గదిలో సాయంకాలం మంచంమీద పరుపు సర్దుతూ ఆ పనిమనిషి మూర్ఛతో ఆ మంచం మీద పడిపోయింది. ఆమెని వెలకిలా పడుకోబెట్టి ఆమెకి గిరిబాబు ఉపచారాలు చెయ్యవలసి వచ్చింది.

ఆ విధంగా గిరిబాబు ఆమెకి ఉపచారం చేస్తూండగా అప్పుడే అక్కడికి వచ్చిన కాలేజీ లెక్చర రొకాయన చూసి గిరుక్కున వీధిలోకి వెళ్ళిపోయేడు. ఆ లెక్చరర్‌కి కళ్ళూ చెవులే కాకుండా ఊరంత ఊహా, ఒక నోరూ కూడా ఉన్నాయి. ఆ నోరు కూడా చాలా పెద్దది. ఎవరో చెప్పినట్టు అతనికి నోరొక్కటే కాని ఆ ఒక్క నోటితోనూ అతను యుగళగీతాలు పాడవచ్చునన్నమాట. అంత పెద్దనోరు అది. ఆ నోటికతను ఊహని తోడిచ్చి - ఫుల్ ఫ్రీడమ్ - పూర్తి స్వాతంత్రం ఇచ్చేసేడు.

గిరిబాబు వ్యభిచారీ, తాగుబోతూ, జూదరీ, దుర్మార్గుడూ అని ఊరంతా టమటమా అయిపోయింది. శ్యామకి దూరపు చుట్టం ఒక అమ్మాయి కాలేజీలో చదువుతోంది. ఆమె ఒకనాడు ఓ కంటికి కాటిక పెట్టుకొని రెండో కంటికి పెట్టుకోవడం మర్చిపోయి తొందరగానూ లేటుగానూ కాలేజికి వెళ్ళి తిన్నగా క్లాసులో కూర్చొంది. అపుడు ఆ క్లాసుకి గిరిబాబు పాఠం చెప్తున్నాడు. ఆమె రూపం వింతగా ఉండటం వల్ల అతను చాలాసార్లు వింతగా ప్రశ్నార్థకంగా ఆమెవైపు చూసేడు. ఆ అమ్మాయికి అనుమానమూ, కోపమూ, సెక్సు ఎక్కువ. అందుచేత ఆమె వెంటనే వెళ్ళి ప్రిన్సిపాల్‌గారితో రిపోర్టు చేసింది. గిరిబాబుని పిల్చి ప్రిన్సిపాల్‌గారు చీవాట్లు పెట్టేరు. గిరిబాబు ఆ సమయంలో ఆ అమ్మాయి ముఖం చూసి అందులో వింతేమిటో అప్పుడు కనిబెట్టి తను ఆమెని ఇన్‌సల్ట్ చేసేవాణ్ని కాననీ ఆమె ఆ విధంగా వికారంగా రావడం వల్ల ....

'మిష్టర్ గిరిబాబూ! చాలు మీ సంజాయిషీలు! .... చాలు' అన్నాడు ప్రిన్సిపాల్‌గారు.

ఆ అమ్మాయి ఆ తరవాత తన ముఖాన్ని అద్దంలో చూసుకొని ముఖం సరిచేసుకొంది. కాని ఆమెకి గిరిబాబు యెడల కోపం మాత్రం తగ్గలేదు. ఆ తరవాత ఆమె చిన్నన్న గిరిబాబుని కొట్టబోయేడు. గిరిబాబు జీవితంలో పెద్ద రభసై పోయింది.

"ఛీ ఛీ ఛీ! .... ఛీ మానవులు!" అనుకున్నాడు గిరిబాబు. అలాగే అన్నాడు కూడా సూరిబాబుతో.

"మన వీధుల్లో ఉండేవాళ్లూ మనచుట్టూ ఉండేవాళ్లూ చాలమంది అలానే ఉంటారంటే వప్పుకుంటాను కాని మానవులంతా అంతే అంటే మాత్రం నేను నేనొప్పుకోను" అన్నాడు సూరిబాబు.

"నీకు తెలీదురా సూరీ" అన్నాడు గిరిబాబు.

ఆ మర్నాడు -

గిరిబాబుకి నోటీసు వచ్చింది. అది చదువుకొని అతను పిచ్చివాళ్ళా కేకలు వేసుకున్నాడు. "మనం మానవులం కాదు. పశువులం కాము. రాక్షసులం కూడా కాదు. దెయ్యాలం దెయ్యాలం!" అని ఇంట్లో అరుచుకొంటూ కూర్చున్నాడతను.

గిరిబాబు రాక్షసుడేకాని మానవుడు కాడనీ, వ్యభిచారం గురించి అప్పులు చేసి పిత్రార్జితం అంతా పాడు చేస్తున్నాడనీ, తననీ తన కొడుకుని పోషించ నిరాకరించి తన్ని తగిలివేసినాడని చెప్తూ కుమారుని తరపున తల్లిగా, సంరక్షకురాలిగా పంపకం కోసం దావా వేసింది శ్యామ. అంతేకాదు "తనకున్ను కుమారునకున్ను మనోవర్తి ఇప్పించగలందులకు" వేరొక దావావేసి "పిత్రీయమైన గిరిబాబు ఇంటియందు గిరిబాబుకి ఉండుకున్న అర్ధవాటా" ప్రథమ జప్తు చేయింపించింది.

ఆ విధంగా గిరిబాబు బతుకు రోడ్డెక్కటమే కాకుండా కోర్టుక్కూడా ఎక్కింది.

గిరిబాబుకి నోటీసులు వచ్చి రెండు నెలలయింది.

అయితే -

మూడోనెల కాగానే అతని జీవితం మళ్ళీ ఒక కొసకి వచ్చింది. అందుకు సూరిబాబు చొరవా సాహసం కొంత కారణాలని చాలామంది చెప్తారు.

దాకనోటి లెక్చరర్ పర్మిషన్ లేకుండా ప్రైవేటు పాఠాలు చెపుతున్నాడని, వాళ్ళలో కొందరికి పరీక్షా పత్రంలోని ప్రశ్నలు కూడా తెలియజేస్తున్నాడనీ తన తమ్ముడిచేత అర్జీరాయించి అది పట్టుకువెళ్ళి ఆ లెక్చరర్‌కి చూపించేడు సూరిబాబు. అతను ముందుగా చాలా విర్రవీగేడు కాని ఆ తరవాత గిరిబాబుకి పబ్లిగ్గా కాలేజీ లెక్చరర్స్ ఎదుట క్షమాపణ చెప్పుకున్నాడు.

ఒక్క కంటికే ఓనాడు కాటిక పెట్టుకున్న కాలేజీ అమ్మాయికి ఎందుచేతనోగాని మాటి మాటికీ పైట జారుతుంటుంది. "మా తమ్ముడు మీ చెల్లెలికి క్లాసమేట్. పైటజారుడు పతివ్రత పేరుతో మీ చెల్లెలి ఫొటోలు కొన్ని స్టూడెంట్సు మధ్య తిరుగుతున్నాయి. చూడు బ్రదర్" అని ఆ పైటజారుడు స్థితిలో వున్న ఆమె ఫొటోలు కొన్ని ఆమె చిన్నన్నని ఇంటికి పిల్చి చూపించేడు సూరిబాబు. అందులో ఒక ఫొటో "రాత్రి రహస్యం" అనే సినిమా పోస్టర్‌గల సినీమాహాలు వద్ద ఒక కౌబాయ్ పాంటు కుర్రాడితో ఆ అమ్మాయి మాట్లాడుతూండగా తీసిన ఫొటో. ఆ చిన్నన్న వెంటనే ఇంటికివెళ్ళి "రాత్రి రహస్యం సినిమా ఎలా వుందే చెల్లీ" అని అడిగితే, "ఛీ, అలాంటి సినీమాలు నేను చూస్తానా చిన్నన్నా?!" అని చెప్పిందట. దాన్తో ఆ చిన్నన్న ఆమెచేత గిరిబాబుకి అపాలజీ చెప్పించి తనుకూడా చెప్పుకొని సూరిబాబు తమ్ముడి దగ్గర్నుంచి ఫొటోలు నెగిటీవులు కూడా తీసుకున్నాడు.

తరవాత సూరిబాబు సలహామీద, కాలేజీకి గిరిబాబు నెల్లాళ్ళు సెలవు పెట్టేడు.

ఆ తరువాత వారం రోజులకి సూరిబాబు శ్యామ కన్నవారింటికి వెళ్లి "గిరిబాబు ఉన్నాడా?" అని అడిగేడు.

ఆ ప్రశ్నకి అక్కడ వారంతా ఆశ్చర్యపోయేరు. "ఏం? అక్కడ ఆ వూళ్ళో లేడా?" అని అడిగేరు. "సెలవు పెట్టేసి ఎక్కడికో వెళ్ళిపోయేడు" అన్నాడు సూరిబాబు.

మరొక నాలుగు రోజులకి సూరిబాబు శ్యామ తండ్రికి జాబు రాసేడు. గిరిబాబు పిత్రార్జితంలో తనకున్న అర్ధవాటా ఏదో ప్రేమ సంఘానికి దానం చేసి సన్యసించి ఎక్కడికో వెళ్ళిపోయినట్టుగా తెలిసిందని శ్యామ తండ్రికి ఆ ఉత్తరం ద్వారా తెలియజేసేడు సూరిబాబు. ఆ ఉత్తరం చివార్న మరొక విషయమూ కూడా గొలికేడు. రమ అప్పు తీసుకున్న సొమ్ములో ఆమె సంగం తీర్చినట్టూ, ఆ సొమ్ము పట్టుకునే గిరిబాబు ఎక్కడికో వెళ్ళిపోయినట్టూ కూడా తెలిసిందని రాసేడు సూరిబాబు.

తరవాత శ్యామా ఆమె తండ్రీ కూడా పరిగెట్టుకుని వచ్చేరు. గిరిబాబు ఆచోకీ తెలుసుకొందుకు సూరిబాబే వాళ్ళకి ఆధారం అయేడు. "వాడి సగం వాటా ఖరీదు పాతికవేలకి తక్కువుండదు" అని కంట తడి పెట్టుకున్నాడు శ్యామ తండ్రి. గుండెలు బాదుకొని ఏడ్చింది శ్యామ.

సూరిబాబు చేసిన ప్రయత్నం ఫలితంగా గిరిబాబు అరసవిల్లిలోనో శ్రీకూర్మంలోనే కాషాయ దుస్తుల్లో ఎవరికో కనిపించినట్టుగా శ్యామకీ తండ్రికీ భోగట్టా తెలిసింది. అక్కడికి సూరిబాబుని తోడు తీసుకొని ఆడుతుంబడుతుం అని వాళ్ళు వెళ్ళేరు. అక్కడ ఓ సత్రంలో

గిరిబాబు వాళ్ళకు ఎదురయేడు. శ్యామా ఆమె తండ్రికూడా అతణ్ణి బతిమాలుకొని ఇంటికి తెచ్చుకున్నారు. బతిమాలుకొనే ముందుగా వెళుతూనే వాళ్ళు వేసిన మొదటి ప్రశ్న - 'దాని పట్టా రిజిష్ట్రీ అయిపోలేదు కదా?' - అది విని 'ఇంకా అవలేదు' అని చెప్పి వేదాంతిగా నవ్వుకున్నాడు గిరిబాబు.

దావాలు ఉపసంహరించుకొని కుదుటగా గిరిబాబుతో కాపురం చేయడానికి శ్యామ వచ్చి వారం రోజులయింది. తరువాత ఆదివారంనాడు సాయంకాలం ఏడు గంటలకి గిరిబాబూ సూరిబాబూ సముద్రపొడ్డున కూర్చున్నారు! చీకటి పడింది. బాబులిద్దరూ కూర్చున్న చోటుకి దూరంలో జనం ఎక్కువ మందున్నారు. అక్కడ విద్యుద్దీపాలు కూడా వెలుగుతున్నాయి. చీకటి హాల్లో కూర్చుని సినిమా చూస్తున్నట్లుగా అటు చూసి గిరిబాబు కొన్ని మాటలన్నాడు.

"ఒరే సూరీ! ఏం లోకంరా ఇది? తల్చుకుంటే అసహ్యం వేస్తోందిరా? ఇంతమంది మానవుల్లో మచ్చుకొక్కడయినా కనిపించడు కదురా మంచివాడు!" అన్నాడు గిరిబాబు.

ఆ మాటలువిని, సూరిబాబు తన కెదురుగా ఉన్న సముద్రపు కెరటాలమీది వెన్నెల తుంపురుల్ని చూస్తూ సన్నగా నవ్వేడు.

సాయంకాలం ఏడయింది. చంద్రుడు వింతశోభతో వెలుగుతున్నాడు. సంద్రం మంద్రస్థాయిలో పాడుతోంది. రోజంతా మండుటెండలో పనిచేసిన గాలితెరలు ఆ సముద్రపు తడిలో చల్లగా స్నానం చేసి మెల్ల మెల్లగా వద్దుకొస్తున్నాయి. ఆకసంలో అక్కడెక్కడో ఓ చక్కదనాల చుక్క ఎందుకోగాని పరవశించిపోతోంది. ఇసకతిన్నెలో దగ్గర్లో ఎక్కడో ఒక పిల్లో పిల్లడోగాని పకపక నవ్వుతూండగా వాళ్ళ అమ్మ కాబోలు వాణ్ని ముద్దు ముద్దు లాడుతోంది.

పాఠక మహాశయా! ఆ సమయంలో సూరిబాబు నవ్వేడు కదా? అతనెందుకు నవ్వేడో నీవు చెప్పుకోగలవా?